జగనన్న సురక్షతో మెరుగైన సేవలు

ఉయ్యూరు: జగనన్న సురక్షతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని 17, 18 వార్డుల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సచివాలయాల ద్వారా పాలన క్షేత్రస్థాయికి చేరిందన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ ప్రభుత్వ సేవలు సమర్థంగా అందుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వలంటీర్లు ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు రాజులపాటి చిన్ని, తెనాలి పద్మావతి, డాక్టర్ జంపాన పూర్ణిమ, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో జరిగిన జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

విభిన్న ప్రతిభావంతులకు త్రిచక్రవాహనాల అందజేత

విభిన్న ప్రతిభావంతులకు చేయూత అందించాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పలువురు విభిన్న ప్రతిభావంతులకు మోటరైజ్డ్ త్రిచక్రవాహనాలను మంగళవారం పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజెన్ అసిస్టెన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

- **పెనమలూరు:** తాడిగడప సచివాలయం 1లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తాడిగడపలో 997 సర్టిఫికెట్లు జారీ చేశారు. తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, మాజీ సర్పంచి మేడసాని రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.
- యనమలకుదురు సచివాలయం 2లో 1414 సర్టిఫికెట్లు జారీ చేశారు. కమిషనర్ ప్రకాశరావుతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు గుమ్మడి విజయ్‌కుమార్, యార్లగడ్డ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు-3 సచివాలయంలో పత్రాలు ఇస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు

- **పాతపాడు(విజయవాడరూరల్):** పాతపాడు పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి చెన్నకేశవరావు అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం జరిగింది. 770 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, సర్పంచి దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **కంకిపాడు:** మండలంలోని ఈడుపుగల్లు-1 సచివాలయంలో ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.



తాడిగడపలో సర్టిఫికెట్ అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ

ప్రజలకు రక్ష

కంకిపాడు: జగనన్న సురక్ష ప్రజలకు రక్ష అని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు-3 సచివాలయంలో 1160 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ బాకీ రమణ, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, డీఎల్‌డీఓ నాంచారరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: రూరల్ మండలం ఎనికేపాడు సచివాలయం-2లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి 436 మందికి 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేశారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, తహసీల్దార్ పి.జాహ్నవి, ఉపసర్పంచ్ టంకసాల శివ, ఎంపీటీసీలు రావమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్‌లో

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వలంటీర్ల సర్వేల్లో వచ్చిన 1402 అర్జీలను పరిష్కరించి వివిధ సర్టిఫికెట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. 837 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, 556 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఐదుగురికి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, 50 మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్‌లో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే అనిల్ నియామకంపై హర్షం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్‌గా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నియమితులు కావటంపై వైఎస్సార్ సీపీ నాయకులు పలువురు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఆయన స్వగ్రామానికి చెందిన సర్పంచ్ అడపా అంజిబాబు, వీరవల్లి పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, మాజీ చైర్మన్ గూడవల్లి రత్న సుధాకర్, గన్నవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొడెబోయిన బాబి, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి రాయి శివ పార్వతి ఆయన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

కాల్వల్లో చెత్త వేస్తే జరిమానా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రధాన కాల్వల్లో చెత్త వేసే వారికి జరిమానా విధించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం బందరు, ఏలూరు, రైవస్, కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించాలంటే ప్రధానంగా పరిసరాలు, కాల్వలు, రహదారులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి రోడ్లపై వేస్తున్న వారిని గుర్తించాలన్నారు. అవసరమైతే సీసీ కెమెరాలను పరిశీలించి చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. వ్యర్థాలు తరలించే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ వర్కర్లందరూ కాల్వలు, వీధులు నిరంతరం శుభ్రం చేయాలన్నారు. కమిషనర్ పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

30న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ఉయ్యూరు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 30వ తేదీన అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు బయలుదేరుతుందని డిపో మేనేజర్ కేఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు తెలుపుతూ 30వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటలకు డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. 31న కాణిపాకం, అనంతరం గోల్డెన్ టెంపుల్, ఆగస్టు 1న అరుణాచలం చేరుతుందని వివరించారు. భక్తుల దర్శనం అనంతరం కాంచీపురం, తిరుత్తణి కుమారస్వామి, కాళహస్తి అక్కడ నుంచి 2వ తేదీన ఉయ్యూరుకు చేరుతుందన్నారు. టికెట్ ధర రూ.3 వేలు, హాఫ్ టికెట్ రూ.2250గా నిర్ణయించామన్నారు. వివరాలకు 73828 93468లో సంప్రదించాలని సూచించారు.

భగవద్గీతపై ప్రచారం



గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి, మాదలవారిగూడెం గ్రామాల్లో మంగళవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం జరిగింది. కె.రమాదేవి, నర్సింహస్వామి, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉయ్యూరు: ఉయ్యూరు ఆర్టీసీ డిపోలో ఈ నెల 19న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం కేఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రజలు ఆర్టీసీ సేవలపై సలహాలు, సూచనలు అందించాలని, 9959224796 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రెండు గేదెలు చోరీ

పెనమలూరు: కానూరులో రెండు గేదెల చోరీ జరగటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పామర్రుకు చెందిన దేవనబోయిన శివరామకృష్ణ గేదెల వ్యాపారి. అతను తన రెండు గేదెలను ఈ నెల 16న కానూరులో బంధువు చలమలశెట్టి వేణుగోపాల్ ఇంటి వద్దకు తీసుకు వచ్చి షెడ్‌లో కట్టేశాడు. ఈ నెల 17వ తేదీ ఉదయం లేచేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆ రెండు గేదెలను చోరీ చేశారు. వాటి విలువ రూ 2.35 లక్షలు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

61 మందికి కంటి పరీక్షలు



కంకిపాడు: కంకిపాడులో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ 61 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. దృష్టి లోపాలు ఉన్న వారిని గుర్తించి కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలపై ఉన్నతాధికారులకు నివేదించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఎల్ఈడీ టీవీ బహూకరణ

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని తల్లి వెల్ఫేర్ అసోసియేషన్ వృద్ధాశ్రమానికి దాత గేదెల వెంకట్ ఎల్ఈడీ టీవీని బహూకరించారు. మంగళవారం ఆశ్రమ నిర్వాహకురాలు రాచేటి రూతమ్మకు 32 అంగుళాల ఎల్ఈడీ టీవీని ఆయన అందజేశారు. దాతను అభినందించారు.

రామన్నగూడెం రోడ్డుకు రూ.5.50 కోట్ల నిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో రైతులకు ఉపయోగపడే రామన్నగూడెం రోడ్డు నిర్మాణానికి రూ.5.50 కోట్ల నిధులు మంజూరైనట్లు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద నిధులు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. రామన్నగూడెం నుంచి వయా రంగయ్య అప్పారావు పేట మీదుగా 6.8 కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించండి

గన్నవరం: ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే వర్షకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో మంగళవారం ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘ నాయకులు తిరివీధి చిట్టిపండు, బుజ్జి, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం

ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: గడప గడపకు సంక్షేమ పాలన అందుతోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు మునిసిపాలిటీలోని 18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే.. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలన వివరించి, ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సచివాలయ, వలంటీరు వ్యవస్థల ద్వారా పాలన సమర్థంగా క్షేత్రస్థాయికి అందుతోందన్నారు. ప్రజల్లో ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలకు, ఎల్లో మీడియాకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

- స్థానిక రైతుబజారులో సబ్సిడీ టమాటాల విక్రయాలను ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వమే కిలో రూ.50కు టమాటా అందజేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు 18వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

రాయితీపై టమాటా, కందిపప్పు విక్రయాలు

గన్నవరం: సామాన్యులు ఇబ్బంది పడకుండా టమాటా, కందిపప్పును రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి తెలిపారు. స్థానిక రైతుబజార్‌లో కిలో టమాటా రూ. 50, కందిపప్పు రూ. 125లకు విక్రయాలను మంగళవారం ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగనబోయిన బాలమధురశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజనీకుమారి మాట్లాడుతూ రాయితీపై వీటిని అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు రామవరప్పాడు, నున్న, తేలప్రోలులో వచ్చే దసరా నాటికి రైతుబజార్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. గన్నవరం రైతుబజార్‌లో వాహనాల పార్కింగ్‌కు మెరక పనులు, గన్నవరం మార్కెట్ యార్డులో మరమ్మతులు, బాపులపాడు సీసీ రోడ్లు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఏఎంసీ డైరెక్టర్లు మోటమర్రి శేఖర్, ఆవుటపల్లి రోజారాణి తదితరులు పాల్గొన్నారు.



టమాటా విక్రయాలు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ

అన్ని వర్గాలకు ఆర్టీసీ సేవలు

తాతినేని పద్మావతి

పెనమలూరు: ఆర్టీసీ బస్సులు అన్నివర్గాల ప్రజలకు, అన్ని ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నాయని ఆ సంస్థ రీజియన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. వణుకూరు గ్రామానికి వచ్చే 121రూట్ బస్సును విద్యార్థుల కోసం వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు పొడిగించి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ప్రజల అవసరాల దృష్ట్యా ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ఉదయం 8.15 గంటలకు, సాయంత్రం 4 గంటలకు పాఠశాల వరకు ఆర్టీసీ బస్సు వస్తుందని, విద్యార్థులు బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి గద్దల రాజా, పెనమలూరు సొసైటీ అధ్యక్షుడు వేమూరి రాజా, వైఎస్సార్ సీపీ నేత వల్లే నరసింహారావు, గవర్నర్‌పేట డిపో మేనేజర్, పలువురు పాల్గొన్నారు.



వణుకూరు జెడ్పీ పాఠశాల వరకు ఆర్టీసీ సర్వీస్ పొడిగించి ప్రారంభిస్తున్న తాతినేని పద్మావతి

పర్యావరణ మార్పులపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో చైల్డ్ ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో జెండర్, వాతావరణ మార్పులకు కారణాలు, నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడీపీఓ నాగమణి, ఏసీడీపీఓ జ్యోత్స్న, ఎంపీటీసీ కల్పన కిషోర్, విజయవాడ రూరల్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ.. చిన్నారులపై లింగ వివక్ష చూపరాదన్నారు. అందరినీ సమానంగా చూడాలని తల్లిదండ్రులకు చెప్పారు. ప్రోగ్రామ్ సీనియర్ ఆఫీసర్ ఏ.రాజ్‌కుమార్, పి.రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణానికి హాని కలిగించరాదన్నారు. ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. కమ్యూనిటీ మొబిలైజర్స్ నవీన్, రజని, లావణ్య, పుణ్యవతి, దివ్య పాల్గొని పర్యావరణంలో మార్పులకు గల కారణాలను వివరించారు.

డ్రైయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): ప్రాధాన్యతా క్రమంలో నున్న గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని సర్పంచి కాటూరి సరళశ్రీనివాస్ అన్నారు. ఇందిరానగర్ ఎస్సీ కాలనీలో రూ.34 లక్షల వ్యయ అంచనాతో 750 మీటర్ల పొడవైన డ్రైనేజీ నిర్మాణం పనులను సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన ఉండాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏడీసీపీ విశాల్‌గున్ని, నార్త్ డివిజన్ ఏసీపీ రవికాంత్ ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు మెడికల్, ఫ్యాన్సీ షాపుల నిర్వాహకులతో మత్తు పదార్థాల విక్రయంపై మంగళవారం అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే వైట్‌నర్, సొల్యూషన్ పీల్చడం, మెడికల్ షాపుల్లో లభించే బోన్‌ఫిక్స్, పలు రకాల మత్తు మాత్రలు వాడటం ఎక్కువగా జరుగుతోందన్నారు. వాటిని అరికట్టేందుకు మెడికల్ షాపు నిర్వాహకులు డాక్టర్ ప్రిస్కిప్షన్ లేనిదే యువతకు ఎటువంటి మందులూ విక్రయించొద్దని స్పష్టంచేశారు.

సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఎస్వీఆర్ అద్వితీయ నటన చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వవిఖ్యాత నటుడు సామర్లకోట వెంకట రంగారావు(ఎస్వీఆర్) అద్వితీయ నటన చిరస్మరణీయమని ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి ఐక్య సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు అన్నారు. ఎస్వీఆర్ వర్ధంతి సందర్భంగా విద్యాధరపురం వంగవీటి మోహన రంగా జంక్షన్‌లోగల సంఘ కార్యాలయంలో ఎస్వీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

తొలుత ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

భారతరత్నతో గౌరవించాలి..

దుర్గారావు మాట్లాడుతూ.. ఎస్వీ రంగారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలన్నారు. తన నటన ద్వారా ఆబాలగోపాలాన్ని ఎంతగానో అలరించిన ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలని యావత్ తెలుగు ప్రజలతో పాటు ఆయన అభిమానులు, కళాకారులు ముక్తకంఠంతో నినదిస్తున్నారని తెలిపారు. ఎస్వీఆర్ సేవలను సంఘం అధ్యక్షుడు పదిలం రాజశేఖర్ కొనియాడారు. కాపు సంఘం నాయకులు చందూరు సత్యనారాయణ, జవ్వాది వెంకట్రావు, సుంకర నారాయణ, నల్లం వాసు, ఇనపకుర్తి రాము, ఉండభట్ల వెంకట్రావు, మంగ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వేగంగా వ్యవసాయ పనులు





సారవంతమైన భూమిపై రైతు ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేస్తుండగా, పచ్చని చెట్లు రైతుకు కవచంగా మారాయి. నింగి, నేల నీలంగా మారి.. తడిసిన భూమాత నుంచి వస్తున్న కమ్మటి మట్టి వాసనలు ఉత్సాహన్ని నింపుతుండగా.. రైతే రాజుగా మారుతున్నాడు. జిల్లాలో పలుచోట్ల వర్షాలు పడుతుండటంతో శరవేగంగా వరి నాట్లు సాగుతున్నాయి. దీనిలో భాగంగా కృష్ణా జిల్లా కాటూరు గ్రామ శివారులో, తాడిగడపలో చక చకా జరుగుతున్న వ్యవసాయ పనుల దృశ్యాలను సాక్షి క్లిక్‌మనిపించింది.
-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పోరంకి పరిధిలో విద్యుత్ సర్వీస్ నెంబర్ల మార్పు

పెనమలూరు: పోరంకి విద్యుత్ శాఖ కొత్తగా సెక్షన్ ఏర్పాటు జరగటంతో విద్యుత్ సర్వీస్ నెంబర్లలో మార్పులు జరిగాయని ఆ శాఖ ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో గంగూరు సెక్షన్‌లో పోరంకి ఉండేదని పేర్కొన్నారు. తాజాగా పోరంకి ప్రాంతాన్ని కొత్త సెక్షన్‌గా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలో ఉన్న దాదాపు 17 వేల విద్యుత్ కనెక్షన్‌లకు సర్వీసు నెంబర్ల మార్పు జరిగిందని వివరించారు. ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లించేవారు మార్పును తప్పక గమనించాలని సూచించారు. సర్వీసు నెంబర్లు 13 అంకెలు ఉంటాయని వీటిలో మొదటి ఏడు అంకెలు మారాయని తెలిపారు. చివరి ఆరు అంకెలు మారలేదన్నారు. అవసరమైతే విద్యుత్ వినియోగదారులు ఏఈ నెంబర్ 8330938790కి ఫోన్ చేయాలని సూచించారు.

పాత సర్వీసు నెంబర్	కొత్త సర్వీస్ నెంబర్
6521304	6521501
6521341	6521502
6521342	6521503
6521343	6521504
6521344	6521505
6521345	6521506
6521346	6521507

వీరాంజనేయ స్వామి సన్నిధిలో అన్నదానం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షాపీఠంలోని శ్రీ రామభక్త అభయ వీరాంజనేయ స్వామి వారికి మంగళవారం విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు చేపట్టారు. అనంతరం తమలపాకులతో అర్చన, పంచహారతుల సేవ నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పాదచారులు, వాహన చోదకులు, స్థానికులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.